క్లుప్తంగా

అనారోగ్య బాధితుడికి రూ.25 వేల ఆర్థిక సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు

రావులపాలెం: అనారోగ్యంతో బాధపడుతున్న బాధితుడికి స్థానిక కాశీఅన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.25 వేల ఆర్థిక సాయాన్ని గురువారం అందజేశారు. ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామానికి చెందిన దైవాల రామకృష్ణ ఇంటి శ్లాబులు వేసే జట్టు కార్మికుడు. కొంతకాలంగా పాంక్రియాసిస్ లివర్ సంబంధ వ్యాధితో బాధపడుతున్నారు. ఇప్పటికే ఒకసారి పాంక్రియాస్ ఆపరేషన్ చేసి స్టంట్ వేశారు. ఇప్పుడు మళ్లీ ఆపరేషన్ చేయాలని, దానికి సుమారుగా రూ.2 లక్షల వరకు ఖర్చవుతుందని డాక్టర్లు చెప్పారు. కూలి పనికి వెళ్లే రామకృష్ణకు అంత స్తోమత లేకపోవడంతో బంధువుల సహాయం కోసం కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరగా ఈరోజు ర్యాలిలో ఆయన ఇంటికి వెళ్లి సంస్థ సభ్యులు చేతుల మీదుగా రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేసినట్టు సభ్యులు తెలిపారు.

ఘనంగా స్వామి వారి చక్రస్నానం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి క్షేత్రపాలకుడు వేణుగోపాల స్వామి చక్రస్నానం శుక్రవారం ఘనంగా జరిగింది. స్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామికి సుప్రభాతసేవ, పుణ్యాహవాచనం, పూర్ణాహుతి, చక్రస్నానం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణ చైతన్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఏఎంసీ చైర్‌పర్సన్ రోజారమణి రాజీనామా

రాజోలు: రాజోలు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి శుక్రవారం రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో పార్టీ ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఆమె రాజీనామా పత్రాన్ని మార్కెట్ కమిటీ అధికారులకు అందజేశారు. అలాగే ఏఎంసీ వైస్ చైర్మన్ సుంకర బాబ్జి కూడా తన పదవికి రాజీనామా చేశారు. రాబోయే కాలంలో వైఎస్సార్ సీపీ అధినాయకత్వం సూచనల మేరకు పార్టీ కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు గుబ్బల మనోహర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

అయినవిల్లి: మండలంలో 21 గ్రామాల్లో జరిగిన 2023-24 సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపాధి పనులపై శుక్రవారం నుంచి సోషల్ ఆడిట్ బృందం ఆధ్వర్యంలో సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు స్టేట్ రిసోర్స్‌పర్సన్ వి.కనకారావు తెలిపారు. 2023-4 సంవత్సరానికి రూ.8 కోట్ల నిధులు జాతీయ ఉపాధి హామీ పనుల కోసం ఖర్చు పెట్టినట్లు ఆయన తెలిపారు. పది రోజుల పాటు 21 గ్రామాల్లో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇందు కోసం గ్రామాల్లో డీఆర్‌పీ 10 మంది, వీఎస్‌ఏలు 20 గ్రామాల్లో క్షేత్రసాయిల్లో తనిఖీలు నిర్వహిస్తారన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

మామిడికుదురు: పాశర్లపూడి సత్తరువుతోటకు చెందిన వనమాడి అంజలీదేవి (38) పాము కాటుకు గురై శుక్రవారం మృతి చెందిందని నగరం ఎస్సై పి.సురేష్ తెలిపారు. ఇంటి వద్ద గురువారం ఉదయం అంజలీదేవి వాకిలి తుడుస్తుండగా రక్త పింజర ఆమెను కాటు వేసిందన్నారు. కుటుంబ సభ్యులు అమలాపురం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు. మృతురాలి భర్త శ్రీమన్నారాయణ ఫిర్యాదు మేరకు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

బడి ఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి


ముక్తేశ్వరంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న డీఈవో కమలకుమారి తదితరులు

అయినవిల్లి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి అన్నారు. శుక్రవారం స్థానిక ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యాయుడు నిమ్మకాయల గణేశ్వరరావు అధ్యక్షతన జరిగిన విద్యా సదస్సుకు జిల్లా విద్యాశాఖ అధికారి కమలకుమారి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ 'నేను బడికి పోతా' ఈనెల 13 నుంచి జూలై 12 వరకు ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. దానిలో భాగంగా అందరి భాగస్వామ్యంతో బడి ఈడు పిల్లలను గుర్తించి గ్రామ వలంటీర్ల సాయంతో బడుల్లో చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు జేవీ కనకదుర్గ, పెచ్చెట్టి శ్రీనివాస్, ఈ.రమేష్ బాబు, సుబ్రహ్మణ్యం, భీమారావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


చింతలూరులోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు వేయిస్తున్న వైద్యాధికారులు


వెలువలపల్లిలో విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న ప్రసాదరావు


రాజోలులో న్యాయమూర్తులకు యోగాసనాలపై శిక్షణ ఇస్తున్న చంద్రశేఖర్


మానేపల్లి బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థినులు


ఆత్రేయపురంలో యోగాపై శిక్షణ ఇస్తున్న దృశ్యం

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- ఘనంగా ప్రపంచ యోగా దినోత్సవం
- పలు సంస్థ ఆధ్వర్యంలో కార్యక్రమాలు
- ఆసనాలతో ఆకట్టుకున్న విద్యార్థులు

రాజోలు: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంతర్జాతీయ యోగా శిక్షకుడు నారాయణ అన్నారు. శుక్రవారం రాజోలు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు కాంప్లెక్స్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని యోగా శిక్షణపై అవగాహన కల్పించారు. యోగా గురువు చిట్టూరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రమీలారాణి, జూనియర్ సివిల్ జడ్జి కె.హిమబిందు, కోర్టు ఉద్యోగులు, న్యాయవాదులకు యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ ఉద్యోగులు పని ఒత్తిళ్లతో అనేక అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. అందుకే రోజూ కొంత సమయాన్ని యోగా చేసేందుకు కేటాయించాలన్నారు. అలాగే రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిబాబు ఆధ్వర్యంలో యోగా శిక్షణ ఇచ్చారు. రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సీఆర్సీ యోగా మిత్రమండలి ఆధ్వర్యంలో..

రావులపాలెం: స్థానిక అంతర్జాతీయ యోగా దినోత్సవం సీఆర్సీలో శుక్రవారం ఘనంగా జరిగాయని వివేకానంద యోగాశ్రమ గురువు, ఆయుర్వేదం ఫిజియోథెరపీ డాక్టర్ యోగా శ్రీనివాస్ తెలిపారు. యోగా దినోత్సవంలో యోగా సభ్యులతో యోగాసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామాలను ఆయన సాధన చేయించారు. కార్యక్రమంలో పలువురు యోగా గురువులు, యోగా సేవకులు పాల్గొని యోగా గొప్పతనాన్ని, విశిష్టతను సభ్యులకు తెలియజేశారు. కార్యక్రమంలో సీఆర్సీ యోగా డైరెక్టర్ మోటూరి ప్రకాశ్రావు, కర్రి సత్తిరెడ్డి, మన్యం వర్ధనరావు, మారిశెట్టి సత్యనారాయణ, విళ్ల రాము, గునిశెట్టి నాగేంద్ర, పసుపులేటి రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా గురువులకు, సేవకులకు ఘన సన్మానం జరిగింది.

మామిడికుదురు: అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం మామిడికుదురు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మామిడికుదురు స్కూల్లో జరిగిన వేడుకల్లో ప్రముఖులు డీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ యోగాతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందన్నారు. ఆదుర్రులో సర్పంచ్ బళ్ల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో, నగరం పీహెచ్‌సీ, పాశర్లపూడిలో వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగుల ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని ఘనంగా జరిపించారు. విద్యార్థులు, ఉద్యోగులతో యోగసనాలు చేయించారు.


మోరి జెడ్పీ ఉన్నత పాఠశాలలో యోగా ఆసనాలు చేస్తున్న విద్యార్థులు

పి.గన్నవరం: మానేపల్లి బాలికల ఉన్నత పాఠశాలలో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులు యోగాసనాలు వేశారు. యోగా చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను పీడీ కేవీ రమణ వివరించారు. బాలుర ఉన్నత పాఠశాలలో కూడా యోగా దినోత్సవాన్ని నిర్వహించారు. పి.గన్నవరం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నెహ్రూ యువకేంద్రం వలంటీర్ బేబీ సరోజని ఆధ్వర్యంలో యోగా దినోత్సవం జరిగింది. ఎంఈఓలు కోన హెలీనా, సీహెచ్ వీరభద్రం, పీడీలు వై.సతీష్, దుర్గాప్రసాద్, సుభాషిణి, యోగా టీచర్ వై.సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.


మామిడికుదురు స్కూల్లో జరిగిన యోగా ఆసనాల్లో పాల్గొన్న విద్యార్థులు

మలికిపురం: యోగా దినోత్సవం సందర్భంగా మలికిపురంలోని ప్రభుత్వం ఎయిడెడ్ కళాశాలలో శుక్రవారం యోగాసనాలతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగా మాస్టర్ కడలి కష్టార్జునరావు విద్యార్థులకు వివిధ ఆసనాలు నేర్పించి అవగాహన కలిగించారు .ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ టి.సతీష్ విద్యార్థి దశ నుంచే యోగాసనాలపై ఆసక్తి ఉంటే జీవితంలో అనుకున్న గోల్ సాధించవచ్చని విద్యార్థులను ప్రోత్సహిస్తూ మాట్లాడారు.

సఖినేటిపల్లి: మానసిక ప్రశాంతతకు, ఆరోగ్యగంగా ఉండడానికి యోగా ఎంతగానో దోహద పడుతుందని అంతర్వేదికర జెడ్పీ ఉన్నత పాఠశాల యోగా టీచర్ మన్నె సత్యనారాయణ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులతో ఆసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయించారు. హెచ్ఎం పడాల సోమ సూర్యకుమారి, పీడీ కె.భాస్కరరావు పాల్గొన్నారు. కేశవదాసుపాలెం ఉండపల్లి వారి మెరకలో సర్పంచ్ మేడిది సరోజ అధ్యక్షతన అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహించారు. అలాగే మోరి, మోరిపోడులో యోగాపై విద్యార్థులకు, ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు.


కొత్తపేట కోర్టు ప్రాంగణంలో యోగాసనాలు చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి రమణారెడ్డి తదితరులు


తొండవరంలో యోగాసనం వేస్తున్న విద్యార్థులు

కొత్తపేట: ప్రతి రోజూ విధిగా యోగా చేయడం వలన శారీరక, మానసిక ఆరోగ్యం చేకూరుతుందని ఎంఈఓ మట్టపర్తి హరిప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎ.గోపాలరాజు ఆధ్వర్యంలో జరిగిన యోగా కార్యక్రమంలో ఎంఈఓ హరిప్రసాద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు. అలాగే మండలంలోని కొత్తపేట, వాడపాలెం, కొత్తపాలెం తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

జీవితంలో యోగా ఒక భాగం కావాలి

ప్రతి ఒక్కరి నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలని స్థానిక సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పి. రమణారెడ్డి అన్నారు.

ఆత్రేయపురం: యోగా అనేది ఒక జీవన విధానమని ఆయుర్వేద వైద్యాధికారి కె.విజయకుమారి, ఆత్రేయపురం పీహెచ్‌సీ వైద్యాధికారి సౌమ్య అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక జెడ్పీ హైస్కూల్ వద్ద విద్యార్థులకు, చిన్నారులకు యోగాపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా యోగా, ధ్యాన్యం చేయాలన్నారు. దీనివల్ల చురుగ్గా ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. అలాగే మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఎంఈఓ వరప్రసాద్, పి.సాహెబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు.

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు ఏటా నిర్వహిస్తున్న ఈ యోగా దినోత్సవాన్ని ప్రజలందరూ ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. మండలంలోని వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు వివిధ గ్రామ సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో రోగాల బారిన పడకుండా, మానసిక ప్రశాంతతకు నిత్యం యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మాచవరం సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. మాచవరంలో బెహరావారి అగ్రహారంలో ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్ క్రీడా ఆవరణలో మాజీ జెడ్పీటీసీ అరిగెల బలరామమూర్తి యోగా డే నిర్వహించారు. అలాగే తొండవరంలో విద్యార్థులు చేసిన యోగాసనాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

అయినవిల్లి: రోజూ క్రమం తప్పకుండా యోగాసానాలు వేయడం ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని యోగా గురువు మోటూరి భైరవస్వామి అన్నారు. శుక్రవారం నల్లచెరువు గ్రామంలో అంత్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వివేకనంద రాక్ మెమోరియల్, వివేకానంద కేంద్ర కన్యాకుమారి సంయుక్త ఆధ్వర్యంలో యోగా పై అవగాహన కల్పించారు. అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలోని వెలువలపల్లిలో యోగాపై హెల్త్ సూపర్‌వైజర్ పి.ప్రసాదరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే వీరవల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కూడా యోగా విశిష్టతను విద్యార్థులకు వివరించారు.

సప్తనదీ తీర్థాలతో మహా జ్యేష్ఠాభిషేకం


అంతర్వేదిలో సప్తనది జలాలతో కూడిన కలశాలతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి దేవస్థానంలో శుక్రవారం జ్యేష్ఠ పూర్ణిమ, జ్యేష్ఠా నక్షత్ర మహా పర్వదినం సందర్భంగా లక్ష్మీనృసింహుని మూలవిరాట్‌కు అర్చకులు, వేదపండితులు సప్తనది తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు, పండితులు వేదమంత్రాలతో నిర్వహించారు. గంగా, యమున, సరస్వతి, గోదావరి, నర్మదా, సింధు, కావేరి పుణ్యనదుల్లోని పవిత్ర జలాలతో స్వామివారి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామ గోపాల రాజా బహద్దూర్ ఆనవాయితీగా ఆయా విశేష పూజల్లో పాల్గొన్నారు. వేకువ జామున అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం అర్చకులు దీక్షాధారణ చేపట్టి, సప్తనది కలశ ఆవాహనాలు, ఆరాధనాలు, విశేష అర్చనలు, అగ్నిమథనం చేసి, కలశలతో ఆలయ ప్రదక్షిణం చేశారు. తదనంతరం సప్తనది జలాలతో చతుర్దశ, నవ, పంచామృత కలశాలతో స్వామివారి మూలవిరాట్‌కు సప్తనది తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించి, స్వామికి విశేష అర్చన చేశారు. శ్రీవారికి ప్రీతికరమైన అప్పాలు, పాయసం, మారేడు దళాలు, ఆవు నెయ్యి తదితర వాటితోను, అమ్మవారికి ప్రీతికరమైన తామర, మోదుగ పుష్పాలతోను, తెల్ల ఆవాలు, ధాన్యం, తేనెతోను మహాశాంతి హోమం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం స్థానాచార్య రామరంగాచార్యులు, వేదపండితుడు చింతా వేంకట శాస్త్రి, అర్చకులు పెద్దింటి వేంకట శ్రీనివాస్, ఎస్.బి.ఎం.రమేష్, పి.రామశేషాచార్యులు, జి.ఎల్.ఎస్.రాజేష్ నిర్వహించారు. సూపరింటెండెంట్ పి.విజయ సారథి, సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, మాజీ సర్పంచ్ వనమాలి మూలాస్వామి పాల్గొన్నారు.

అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి


రాజోలు సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి


రాజోలు: స్పీకర్ స్థానంలో కూర్చోబోయే అయ్యన్నపాత్రుడు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు డిమాండ్ చేశారు. శుక్రవారం రాజోలు పట్టణ వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశంలో గొల్లపల్లి మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలించిన వ్యక్తిపై అప్రజాస్వామిక వ్యాఖ్యలు చేయడం బాధాకరమన్నారు. ఎన్నికల ఫలితాలు పార్టీ నాయకులను, కార్యకర్తలను నిరుత్సాహ పరచినప్పటికీ ప్రజాతీర్పును గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి విజయవాడలో జరిగిన సమావేశంలో ఎంతో ధైర్యాన్ని కల్పించారన్నారు. ఎన్నికల్లో కష్టించి పని చేసిన పార్టీ శ్రేణులకు ఎలాంటి కష్టం రాకుండా చూసుకుంటామన్నారు. రాబోయే రోజుల్లో ప్రజల పక్షాన నిలిచి జగన్ నాయకత్వాన్ని బలపర్చాలని పిలుపునిచ్చారు. రాజోలు, సఖినేటిపల్లి మండల పార్టీ అధ్యక్షులు కట్టా శ్రీనివాసరావు, కుసుమ చంద్రశేఖరరావు, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, మాజీ సర్పంచ్ మట్టా కృష్ణకుమారి, పార్టీ నాయకులు మంగెన సింహాద్రి, మట్టా ఏడుకొండలు, గొల్ల చిన్ని, అడబాల జానకీరామ్, ఉచ్చుల దాసు, బొడ్డపల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లార్వా వృద్ధిని నిర్మూలించాలి


వెలువలపల్లిలో అవగాహన కల్పిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

అయినవిల్లి: దోమల లార్వా వృద్ధిని సామూహికంగా అరికట్టాలని అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి బి.మంగాదేవి అన్నారు. శుక్రవారం అయినవిల్లి పీహెచ్‌సీ పరిధిలోని వెలువలపల్లిలో పీహెచ్‌సీ సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇటీవల వచ్చిన వర్షాల వల్ల గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల దోమ లార్వా వృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు. దోమ లార్వా వృద్ధి చెందకుండా డ్రెయిన్లు, మురుగుగుంటల్లో నీటి నిలువ లేకుండా చూడాలన్నారు. అలాగే వాటిల్లో దోమ లార్వా నిర్మూలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ప్రసాదరావు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు


అమలాపురంలో కలెక్టర్ హిమాన్షుశుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న ఆర్డీవో సత్యనారాయణ

సఖినేటిపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సేవల్లో ఉత్తమ ప్రతిభ చూపిన మండలానికి చెందిన ఇరువురు అధికారులు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డులు శుక్రవారం అందుకున్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఈ మేరకు డీటీ భాస్కర్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ అవార్డులను అందుకున్న వారిలో ఉన్నారు.

అధికారులు, సిబ్బంది సేవలు భేష్

కొత్తపేట: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కొత్తపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అధికారులు, సిబ్బంది ఎన్నికలు విజయవంతంగా నిర్వహించారని కలెక్టర్ హిమాన్షు శుక్లా అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలు అందించిన ఆర్డీవో సత్యనారాయణ, తహసీల్దార్ ఎలీషా, ఎలక్షన్, జనరల్ డీటీలు ఎం.సత్యనారాయణ, ఎస్ఎస్ఆర్ఎస్ ప్రసూన, ఆర్డీ రామచంద్రమూర్తి, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, ఆర్డీఓ సీసీ వాసంశెట్టి వెంకటేష్, ఆర్డీఓ కార్యాలయం ఆఫీస్ సబార్డినేట్ ఎం.ఖాదర్‌వల్లీలకు ఉత్తమ సేవా పురస్కారాలు, సర్టిఫికెట్లను కలెక్టర్ శుక్లా అందజేశారు. వారిని జిల్లా అధికారులు అభినందించారు.

ఎంపీడీఓ శ్రీనివాస్‌కు అవార్డు

ఆత్రేయపురం: మండల పరిషత్ ఎంపీడీఓ శ్రీనివాస్‌కు సాధారణ ఎన్నికల్లో ఉత్తమ సేవలకు గుర్తింపుగా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీంతో ఆయనను పలువురు అభినందించారు.

కంప్యూటర్ పరిజ్ఞానంతో ఉద్యోగావకాశాలు


కొత్తపేట డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పెద్దిరాజు

కొత్తపేట: కనీస విద్యార్హతతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ కె.పెద్దిరాజు అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అండ్ కంప్యూటర్ అప్లికేషన్స్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పాసైన విద్యార్థులకు శుక్రవారం నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరికీ కంప్యూటర్ పరిజ్ఞానం ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ప్రధానంగా ఎంఎస్ ఆఫీస్‌లో భాగాలైన ఎంఎస్ వర్డ్, పవర్ పాయింట్, ఇంటర్‌నెట్ ఏక్సెస్‌పై శిక్షణ ఉంటుందన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా, కంప్యూటర్ పరిజ్ఞాన ఉద్యోగులుగా జీవితంలో స్థిరపడాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, కంప్యూటర్ విభాగాధిపతి కేఎస్ఎన్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ డీసీహెచ్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

23న సీతారామచంద్రస్వామి బ్రహ్మోత్సవం

మామిడికుదురు: నగరం గ్రామంలోని శ్రీహరి క్షేత్రంలో కొలువుదీరిన శ్రీహనుమత్ లక్ష్మణ సమేత సీతారామ చంద్రస్వామి ఆలయం 14వ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ శుక్రవారం తెలిపింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 23వ తేదీ ఆదివారం రాత్రి 7.30 గంటలకు సీతారామ కల్యాణం నిర్వహిస్తామన్నారు. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశామని ఆలయ కమిటీ పేర్కొంది.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తపడాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి జాగ్రత్త పడాలని సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీ రామారావు అన్నారు. గంగలకుర్రు మెట్లకాలనీ, ఇంటిగ్రేటెడ్ వసతి గృహం నందు డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని సీహెచ్ఓ బి.అప్పారావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నివాస ప్రాంతాల మధ్య, మన చుట్టూ ఉండే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. తద్వారా దోమలను అరికట్టవచ్చన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాల బారిన పడతారని అవగాహన కల్పించారు. అనంతరం దోమల నిర్మూలనకు మలాథియన్ స్ప్రేయింగ్ చేయించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.మధుబాబు, హెల్త్ అసిస్టెంట్ జి.ప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ నిషి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కుంకుమ పూజలు


కొత్తపేట బి.సావరం దుర్గాదేవి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కొత్తపేట: జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి సందర్భంగా స్థానిక బొరుసువారిసావరం విజయకనకదుర్గాదేవి అమ్మవారికి మహిళలు శుక్రవారం ప్రత్యేక కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణకర్త బొరుసు వెంకట ఉదయభాస్కర్-వసుధ దంపతుల పర్యవేక్షణలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ పసుపులేటి శ్రీనివాస్-సత్యవేణి దంపతుల ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు బిక్కోలు సత్యనారాయణాచార్యులు, వేదపండితులు బ్రహ్మశ్రీ అనంతలక్ష్మణ కుమారాచార్యులు బ్రహ్మత్వాన పండితులు ఉదయం నుంచీ వైఖానస శాస్త్రోక్త విధానంగా గణపతి పూజ, అమ్మవారికి పంచామృత అభిషేకం, ప్రత్యేక పూజలు, హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం అంగన్‌వాడీ సెంటర్‌లో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యాన అంగన్‌వాడీ గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. రామేశ్వరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ సెంటర్లోని సిబ్బందితో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రీ స్కూల్స్‌లో మంచి వాతావరణంలో పిల్లలకు సదుపాయాలు కల్పిస్తున్నట్లు సూపర్‌వైజర్ షేక్ మీరా మునీషా తెలిపారు. సర్పంచ్ కొండా జాన్‌బాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.